

## ‘నూతన’ ఉత్సాహంతో..

ఉత్తమ సేవలందించండి

వివరాలు 2లో...

18వ వసంతంలోకి..
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
శనివారం 4 జనవరి 2025 పేజీలు 8



### బుడమేరు వరదలు పునరావృతం కాకుండా


# పటిష్ఠ చర్యలు

- గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో నగర ప్రజలు నష్టపోయారు
- బుడమేరు పునర్నిర్మాణానికి అధికారులతో కలిసి ప్రణాళికలు సిద్ధం
- గత ప్రభుత్వం బుడమేరుకు రూపాయి కూడా ఖర్చు చేయలేదు
- రాష్ట్ర మంత్రులు పి.నారాయణ, నిమ్మల రామానాయుడు

వివరాలు 2లో

### వైఎస్సార్ కాలనీలో..

# రేషన్ పుష్ప రాజ్



- సిండికేట్ నాకు అప్పచెప్పండి
- నా వెనకాల బొమ్మసాని ఉన్నారు... అంతా పెద్దన్న చూసుకుంటాడు
- రాత్రి టీడీపీ రేషన్‌ను అడ్డుకున్న వైసీపీ
- రంగంలోకి దిగిన టీడీపీకి చెందిన పుష్ప రాజ్
- వైసీపీ నేతతో ముందుగానే మంతనాలు ?
- తీవ్ర హైడ్రామా మధ్య పుష్ప రాజ్ రాగానే రేషన్ వదిలేసిన వైసీపీ నేత
- యధేచ్ఛగా కాలనీ నుంచి తరలించేసిన టీడీపీ సిండికేట్

7 లో..



### యువతలో ప్రతిభను వెలికి తీసేందుకు

# యువ కెరటాలు



### మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** యువతలో నూతన ఉత్తేజం కలిగించేందుకు, వారిలో దాగివున్న టాలెంట్ వెలికి తీసేందుకు యువ కెరటాలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. స్థానిక హిందూ కళాశాల గ్రౌండ్స్‌లో శుక్రవారం ప్రారంభమైన యువ కెరటాలు కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువతలో స్ఫూర్తిని నింపి నూతన ఉత్సాహాన్ని నింపిన వివేకానందుని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేసుకున్నారు. వివేకానందుని జన్మదినం జనవరి 12న యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నామని దాన్ని పురస్కరించుకొని యువతలో నూతన ఉత్తేజం కల్పించాలని 2014 నుండి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజున పాఠశాల విద్యార్థులకు రెండో రోజున కళాశాల విద్యార్థులకు అనేక ఈవెంట్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈరోజు ఉదయం విద్యార్థులకు చిత్రలేఖనంలో నిర్వహించిన పోటీలకు వేలాది మంది విద్యార్థులు హాజరై తమ టాలెంట్ చూపారని అన్నారు. రేపు కళాశాల విద్యార్థులకు వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మిగతా 2లో

# సంక్షేమ పథకాల గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నేతలకు, జగన్ రెడ్డి లేదు

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



**గన్నవరం, జనవరి 3, మేజర్ న్యూస్ :** సంక్షేమ పథకాల గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నేతలకు కానీ, జగన్ రెడ్డికి కానీ లేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం

2

# బుడమేరు వరదలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు



**గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో నగర ప్రజలు నష్టపోయారు**

**బుడమేరు పునర్నిర్మాణానికి అధికారులతో కలసి ప్రణాళికలు సిద్ధం**

**గత ప్రభుత్వం బుడమేరుకు రూపాయి కూడా ఖర్చు చేయలేదు**

**రాష్ట్ర మంత్రులు పి.నారాయణ, నిమ్మల రామానాయుడు**

విజయవాడ బ్యూరో, జనవరి 3, మేజర్ న్యూస్ : బుడమేరు వరద నియంత్రణ పై విజయవాడ ఇరిగేషన్ క్యాంప్ ఆఫీస్ లో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మున్సిపల్ వ్యవహారాల శాఖ మంత్రి పి. నారాయణ, ఉన్నతాధికారులతో శుక్రవారం సమీక్ష చేశారు. ఈ సమీక్షా సమావేశానికి ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్, మున్సిపల్ వ్యవహారాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కన్నబాబు, సీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, ఇరిగేషన్ ఈఎన్సీ వెంకటేశ్వరావు లతో పాటు ఇరిగేషన్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్, రెవిన్యూ, సర్వే అధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సమగ్ర నివేదిక అందించేందుకు ఆయా శాఖల అధికారులతో బుడమేరుపై సమగ్ర సమీక్ష చేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృత్తం కాకుండా, ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, రెవెన్యూ శాఖలు ఇప్పటికే నాలుగుసార్లు బుడమేరు వరదలపై ముఖ్యమంత్రి సూచనలకు అనుగుణంగా సమీక్షలు చేయడం జరిగింది. అదేవిధంగా వరదల సమయంలో బుడమేరు నుంచి వెళ్లే ప్రవాహ వేగాన్ని పెంచడంతోపాటు 40,000 క్యూసెక్కుల నీరు వచ్చినా తట్టుకునే విధంగా భవిష్యత్ ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. సమీక్ష అనంతరం జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ బుడమేరు నష్టాన్ని అందరం చూశామని, ఒక్కరోజే 50,000 క్యూసెక్కుల వరద నీరు రావడం, మూడు చోట్ల గండ్లు పడటం జరిగాయన్నారు. ముఖ్యమంత్రి అపార అనుభవంతో వరదల నుంచి ప్రజలను గట్టెకించగలిగామన్నారు. భవిష్యత్ లో బుడమేరు వరదల నుంచి ప్రజలను కాపాడేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఆదేశాల మేరకు దీనిపై సమగ్ర నివేదిక అందించేలా ఇరిగేషన్, మున్సిపల్, రెవిన్యూ శాఖల అధికారులతో సమీక్ష చేశామన్నారు. బుడమేరు డైవర్షన్ కెనాల్ కెపాసిటీ ప్రస్తుతం 17,500 క్యూసెక్కుల నుంచి 37,500 క్యూసెక్కులకు పెంచేలా పెండింగ్ పనులు పూర్తి చేసేలా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు యాక్షన్ ప్లాన్ ను సిద్ధం చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు అందిస్తామన్నారు. వెలగలేరు రెగ్యులేటర్ నుండి కొల్లేరు వరకు ఓల్డ్ ఛానెల్ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచనలు చేశామన్నారు. 2014-19 కాలంలోనే బుడమేరు డైవర్షన్ ఛానెల్ సామర్థ్యాన్ని 35 వేల క్యూసెక్కులకు పెంచేలా రూ. 464 కోట్లతో టెండర్లు అప్పగించి 80 శాతం పనులు కూడా పూర్తి చేశామన్నారు. అయితే గత ప్రభుత్వం బుడమేరు విస్తరణకు నిధులు ఉన్నా మిగిలిన 20 శాతం పనులకు సంబంధించి తట్ట మట్టిగాని, బస్తా సిమెంట్ పని గాని వేయలేదన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన పాపం ఫలితమే బుడమేరు ముంపుకు కారణమన్నారు. అంతేకాకుండా దానికి విజయవాడ నగర ప్రజలు మూల్యం చెల్లించాల్సి వచ్చిందన్నారు.

2014-19 కాలంలోనే ఎనికేపాడు యూటీ నుండి కొల్లేరు వరకు వెళ్ళే ఛానల్ విస్తరణ పనులను గత ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. బుడమేరు ఛానెల్ కు సమాంతరంగా ఓల్డ్ ఛానెల్ ను కూడా 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కొల్లేరు నుంచి ఎటువంటి అడ్డంకులు లేకుండా సముద్రానికి వెళ్లేలా ఉప్పుటేరు ను అభివృద్ధి చేస్తామన్నారు. ఇదే అంశం మీద ఈ నెల 18న మరోసారి సమీక్ష చేస్తామన్నారు.


మున్సిపల్ వ్యవహారాల శాఖ మంత్రి నారాయణ మాట్లాడుతూ బుడమేరు వరదల వల్ల విజయవాడ నగరంలోని 34 వార్డుల్లో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. ముఖ్యమంగా 5 లక్షల మంది 4 రోజులు నీళ్ళలోనే ఉండటం బాధాకరమన్నారు. ఆ సమయంలో వారికి కనీసం రోజు వారీ అవసరాలకు కూడా నీరు అందని పరిస్థితి ఉందన్నారు. అయినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందించిన స్ఫూర్తితో ప్రజలకు రోజుకు 20 నుంచి 30 లక్షల డ్రింకింగ్ వాటర్ బాటిళ్ళు పంపిణీ చేశామన్నారు. వాటర్ బాటిళ్ళ పంపిణీని కూడా కొద్దిమంది రాజకీయం చేసారన్నారు. అయితే మేము ప్రజలకు ఏది అవసరమో అదే అందించామన్నారు.

గత ప్రభుత్వం బుడమేరు టెండర్లు రద్దు చేయకుండా ఉంటే విజయవాడకు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. బుడమేరు వరదలకు గత ప్రభుత్వమే కారణమన్నారు. మరోసారి జనవరి 18 న మూడు శాఖల అధికారులతో ఇరిగేషన్, మున్సిపల్, రెవిన్యూ శాఖలతో సమావేశం అవుతామన్నారు. భవిష్యత్తులో విజయవాడ నగరానికి వరద సమస్య లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష చేశామన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా వరద నియంత్రణ చర్యలు చేపట్టడం పై చర్చించామన్నారు. బుడమేరు, కృష్ణానదికి ఒకేసారి వరద వస్తే ఏం చేయాలన్నదానిపై కూడా ప్రధానంగా చర్చించామన్నారు. దీనిపై డిజాస్టర్ మేనేజ్మెంట్ తో కూడా చర్చించాల్సి ఉందన్నారు. ఒక పక్క రాష్ట్ర ఖజానా కూడా ఖాళీ అయిన పరిస్థితి ఉందని అయితే గత ప్రభుత్వం సరైన ఫైనాన్స్ ప్లానింగ్ చేయకపోవడం వల్ల ఇబ్బందులున్నాయన్నారు. ముఖ్యమంత్రి అపార అనుభవం వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇప్పుడిప్పుడే గాడిన పడుతుందన్నారు. బుడమేరు వరద నియంత్రణ కు సంబంధించి కేంద్రానికి నివేదించి కేంద్ర ప్రభుత్వ సహకారం కోరతామన్నారు.

# సంక్షేమ పథకాల గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నేతలకు, జగన్ రెడ్డి లేదు

(మొదటిపేజీ తరువాయి)

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నేతలు సూపర్ సిక్స్ అమలు గురించి అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. మీ పాలనలో నవరత్నాల్లో ఆరు నెలల్లో ఎన్ని అమలు చేశారు..? బహిరంగంగా చర్చకు సిద్ధమా..? జగన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొదటి నెలలో రాజన్న బడిబాట అని ప్రకటన మాత్రమే చేసింది నిజం కాదా..? ఆగష్టు నెలలో వైఎస్సార్ రైతు దినోత్సవం ప్రకటన మాత్రమే విడుదల చేశారు. అదే నెలలో వైఎస్సార్ పెన్షన్ కానుక అంటూ ప్రకటన మాత్రమే విడుదల చేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయి. రాజకీయ నాయకులు నిజాలు నిగ్గు తేల్చేలా ఉంటే.. దేనికైనా సరే పరిష్కారం లభిస్తుంది. పింఛన్ ను పెంచేందుకు మీకు ఆరు నెలలు సమయం పట్టింది. పతనం అంచునా ఉన్న ఆర్థిక వ్యవస్థను దిగజార్చిన పరిస్థితి నిజం కాదా..? వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా అభివృద్ధి ఎలా ఉందో రోడ్లు చూస్తే అర్థం అవుతుంది. రోడ్లను దుస్థితి తీసుకు వచ్చింది.. వైసీపీ ప్రభుత్వం కాదా..? మీ పాలన కాలంలో అభివృద్ధి ఎక్కడా ఉంది. 1950 తరువాత ఏపీలో అభివృద్ధే చేయని ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది వైసీపీ ప్రభుత్వం మాత్రమే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దేశ మొత్తం ఏపీ వైపు చూస్తుంది. సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వాన్ని చూసి పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద పెద్ద సంస్థలు క్యూ కడుతున్నాయి. మంత్రి నారా లోకేష్ సైతం యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యం గా పని చేస్తున్నారు. మీ ప్రభుత్వ హయాంలో కనీసం ఒక్క ఐటీ కంపెనీని కూడా తీసుకువచ్చిన పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పింఛన్ ను రూ.4000 చేశాం. దీపం-2 పథకాన్ని ప్రారంభించి రాష్ట్రంలోని 86 లక్షల మందికి ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేశాం. 203 అన్న క్యాంటీన్లను ప్రారంభించాం. అలాగే రైతుల నుంచి 26 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తున్నాం. ఈ విధంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎప్పుడైనా జరి గిదా..? పాలనను గాలికి వదిలేసి.. వ్యవస్థలను నిర్వీర్యం చేసి.. రోడ్లను అత లాకుతలం చేసి.. పరిశ్రమలను పారిపోయేలా చేసింది వైసీపీ ప్రభుత్వం కాదా..? వైసీపీకి ప్రజల్లో వ్యతిరేకత ఉందని చెప్పాటానికి 2024 ఎన్నికలే నిదర్శనం.. ప్రజలు ఇతర దేశాల నుంచి వచ్చి మరి ఓటు వేసి వైసీపీని కేవలం 11 సీట్లకే పరిమితం చేశారు. ప్రజాతీర్పును గౌరవించకుండా అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కోరడం ఎంత వరకు న్యాయం..? జగన్ రెడ్డి నిర్వహించిన ప్రజాదర్బర్ లో ప్రజలు ఇచ్చిన అర్జీలను తన సొంత నిధులతో పరిష్కారం చూపగలరా..? శాసనసభకు రానీ జగన్ రెడ్డి అర్జీలు తీసుకోవడం వల్ల ఏంటి ఉపయోగం. 4 గురు వైసీపీ ఎంపీలను ప్రజలు గెలిపించారు.. కానీ, అక్కడ మీకు ప్రతిపక్ష హోదా ఏదైనా ఉందా..? లోక్ సభకు వెళ్తున్న మీ పార్టీ వాళ్లు.. ప్రజలు 11 మంది గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే రావడానికి ఎందుకు భయ పడుతున్నారు..? 45 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న సీఎం చంద్రబాబుకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఇలా ఎప్పుడు చూడలేదంటే.. మీ పాలన వైఖరికి అద్దం పడు తుంది. మన మాతృభాషను కించపరిచే విధంగా రోత పత్రికలో రాసుకోవడం బాధకరం. వర్క్ ఫ్రం హోం.. వర్క్ ఫ్రం ఫామ్ హౌస్ లకు కాలం చెల్లింది. అసెంబ్లీని అవమానించకుండా, రాష్ట్ర ప్రజలను అవమానించకుండా అసెంబ్లీకి పులివెందుల ఎమ్మెల్యే రావాలని మీడియా ముఖంగా కోరుతున్నా. జగన్ రెడ్డికి కనీసం ప్రతిపక్ష హోదా కూడా రాదని సీఎం చంద్రబాబుకు నేను ఎప్పుడో చె ప్పాను. జగన్ పాలన ఆర్థిక విధ్వంసానికి పాల్పడింది. కేవలం ఆర్థిక వ్యవస్థను మాత్రమే కాకుండా అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసేశారు. నేడు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి.. అభివృద్ధి చేస్తున్న విషయం మీరు చూడలేకపోతున్నారా..?" అని అన్నారు.



**యువతలో ప్రతిభను వెలికి తీసేందుకు**

# యువ కెరటాలు

(మొదటిపేజీ తరువాయి)

మచిలీపట్నం కేవలం బందర్ లడ్డుకే ప్రసిద్ధి మాత్రమే కాదు ఏ రంగంలోనైనా మచిలీపట్నం ముందు ఉంటుందని నిరూపించాలని విద్యార్థులకు సూచించారు.గత కార్యక్రమాల్లో ప్రపంచ చెస్ ఛాంపియన్ హంపి, నైనా జస్వాల్ వంటి ప్రసిద్ధ క్రీడాకారులు యువతలో స్ఫూర్తి నింపిన విషయం మంత్రి గుర్తు చేశారు. ఏపీకి అత్యధిక ఒలంపిక్ పథకాలు తెచ్చే విధంగా మా వంతు కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొని యువతలో స్ఫూర్తిని నింపిన పోలాండ్ దేశానికి చెందిన టైక్వాండో వరల్డ్ ర్యాంకర్, రెండుసార్లు ఒలంపియన్ అయిన పెట్రిసియ (డబ్ల్యూసిటిఏ డైరెక్టర్, పోలాండ్), డబ్ల్యూసిపిటి డైరెక్టర్ - ఇండియా, టీక్వాండో ఓపెన్ వరల్డ్ కప్ ఛాంపియన్, టీక్వాండో ఇండియన్ నేషనల్ టీం, వరల్డ్ టీక్వాండో గ్రాండ్ స్లాం కి క్వాలిఫై అయిన మొదటి భారతీయుడు శివమ్ త్యాగి లను మంత్రి సాలువ, మెమెంటోలతో సత్కరించారు.

# "నూతన "ఉత్సాహంతో ఉత్తమ సేవలందించండి



**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, జనవరి 3, మేజర్ న్యూస్ :** నూతన సంవత్సరంలో మరింత ఉత్సాహంతో పనిచేసి అభివృద్ధిలో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు కృషిచేద్దామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కోరారు. ఏపీ ఎన్జీవో ఎన్టీఆర్ జిల్లాశాఖ 2025 క్యాలెండర్ను జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సమర్థవంతమైన సేవలందించడంలో ఉద్యోగులది కీలకపాత్ర అన్నారు. ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిస్థాయిలో ప్రజలకు చేరువ చేయడంలో మరింత సమర్థవంతంగా పనిచేయాలన్నారు. అభివృద్ధిలో జిల్లాను నెం.1 స్థానంలో నిలిపేందుకు ఉద్యోగులు, అధికారుల సమష్టి కృషి అవసరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర ఏ 2047 దార్శనిక ప్రణాళికను విడుదల చేసిన నేపథ్యంలో ప్రణాళికలోని లక్ష్యాల సాధనలో ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. జిల్లా కార్యదర్శి డి.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ అన్ని రంగాల్లో జిల్లాను అగ్రగామిగా నిలపడంలో, వివిధ కార్యక్రమాలను విజయవంతం చేయడంలోనూ జిల్లా ఉద్యోగులు ముందుంటారన్నారు. ప్రగతి విషయంలో జిల్లాను ఆదర్శంగా నిలిపేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక కార్యాచరణతో కృషిచేస్తున్నారని.. ఆయన సారథ్యంలో ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు పి.రమేష్, కోశాధికారి బి.సతీష్ కుమార్, కార్యవర్గ సభ్యులు వి.నాగార్జున, ఎం.రాజబాబు, జి.రామకృష్ణ, ఆర్.శ్రీనివాస్, ఎం.గోపాలకృష్ణ, బీవీ రమణ, కె.శివలీల, నగర శాఖ కార్యవర్గ సభ్యులు సీవీఆర్ ప్రసాద్, ఎస్కే నజీరుద్దీన్, డీఎస్ఎన్ శ్రీనివాస్, పి.రాజశేఖర్, సీహెచ్ మధుసూదనరావు, ఎస్కే ఖాసిం సాహెబ్, బీవీ ప్రసాద్, టి.విద్యా సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం క్యాలెండర్ ఆవిష్కరించిన చంద్రబాబు



విజయవాడ మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం క్యాలెండర్ ను శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఆవిష్క రించారు. అలాగే నూతన సంవత్సర టేబుల్ క్యాలెం డర్ను కూడా సీఎం ఆవి ష్కరించారు. ఈ సందర్భం గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డ్రైవర్ల సంఘ రాష్ట్ర అధ్య క్షులు సంసాని శ్రీనివాసరావు, కార్యదర్శి కె చిరంజీవి నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపారు. వారితో పలు సమస్యలు గురించి విన్నవించగా త్వరలో మీ సమస్యలు తీరుస్తానని తెలిపారు. అలాగే చీఫ్ సెక్రటరీ ని కలిసి శు భాకాంక్షలు తెలిపి సభ్యుల సమస్యలపై విన్నవించారు. అందులో ప్రధానంగా కొత్త వాహనము కొనుగోలు గురించి, ఉన్న వాహనాల మరమత్తులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ముఖ్యంగా అవుట్ సోర్స్ డ్రైవర్లకు జీతాలు సరిపోలేదని, చాలీ చాలని జీతాలతో కుటుంబాలు సతమతమవుతున్నాయని, వారిని తక్షణమే రెగ్యులర్ బేసిక్ ఇచ్చి వారి సర్వీసులను ప్రభుత్వ సర్వీసులుగా పరిగణించాలని కోరారు. మంత్రులతో పాటు పలువురు ఐఏఎస్ అధికారులను, సిఎం పేషీలోని ముద్దాడ రవిచంద్ర ని సాధారణ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ని కలిసి సమస్యలపై విన్నవించారు. ముఖ్యంగా కమర్షియల్ శాఖ డ్రైవర్లను బలవంతంగా రివర్స్ ద్వారా అటెండర్లుగా మార్చిన వారిని తిరిగి డ్రైవర్లుగా యధావిధిగా కొనసాగించాలని మనవి చేయగా అందుకు సానుకూలంగా స్పందించడమే కాకుండా అవుట్ సోర్స్ డ్రైవర్ల విషయంలో తగు న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారని అందుకు సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమరావతి డ్రైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సంసాని శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహన డ్రైవర్స్ కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.చిరంజీవి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై. నాగేశ్వరరావు, పామర్తి నాగరాజు,రాష్ట్ర ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ అండ్ కాంట్రాక్టు డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఈడుపుగంటి మోహనరావు, మాధవ్, సురేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.వీరి వెంట చిన్నయ్య, పాపారావు పాల్గొన్నారు.

## కలుపు యాజమాన్యంపై శిక్షణ



ఘంటసాల, మేజర్ న్యూస్: ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల శాస్త్రవేత్తల బృందం మండలం లోని దాలిపర్రు గ్రామంలో వరి మాగాణి మినుములో కలుపు యాజమాన్యం పై శిక్షణ నిర్వ హించారు. ఇందులో భాగంగా సమన్వయకర్త డా. డి. సుధారాణి మినుము లో రెండు, మూడు ఆకుల దశ లోనే కలుపు నివారించుకోవాలి. 20 నుంచి 25 రోజుల దశలో ఇమాజితాపైర్ మార్కెట్లో పర్స్యూట్ 200 గ్రాములు, 200 లీటర్ నీటిలో కలుపుకొని పిచికారి చేసుకోవాలి. మినుము పంటలో బంగారు తీగ కలుపు యాజమాన్యంపై అవగాహన కల్పించారు. సస్యపోషణ శాస్త్రవేత్త డా. యం. వెంకట లక్ష్మి మాట్లాడుతూ గడ్డి జాతి, వెడల్పాకులు ఉండే కలుపు మొక్కలు నివారించాలి అంటే ఫ్యూజి ఫ్లెక్స్ 400 మిల్లీ లీటర్లు 200 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారి చేసుకోవాలన్నారు. బంగారు తీగను నివారిం చాలంటే వరి పనలు తీసిన వెంటనే పెండిమితాలిన్ ఒక లీటరు 20 కిలోల పొడి ఇసుకతో కలుపుకొని వెదజల్లుకోవాలి. ఇది వేసిన వెంటనే 200 లీటర్ల నీళ్లు పిచికారీ చేయాలి. అలానే వేసవి దుక్కులు చేసుకోవాలి. బంగారు తీగ పుష్పించే దశ వరకు ఉంచకూడదు విత్తనము రాకముందే దీనిని నివారించుకోవాలన్నారు. రైతులు, వి ఏ ఏ సత్యదేవ్ పాల్గొన్నారు. అలానే తాడేపల్లి గ్రామములో మినుము పంటపై క్షేత్ర సందర్శన చేశారు. మినుములో కాండం గజ్జి తెగులు బాగా గమనించడంతో రీడోమిల్ గోల్డ్ 300 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని రైతులకు తెలియజేశారు.

## డ్రైవర్ సమయస్ఫూర్తితో ఆర్టీసీ బస్సుకు తప్పిన ముప్పు





పామర్రు జనవరి 3 మేజర్ న్యూస్ : డ్రైవర్ సమయ స్ఫూర్తితో ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పిన సంఘటన పమి డిముక్కల మండల పరిధిలోని మంటాడలో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం శుక్రవారం విజయవాడ కాళేశ్వరరావు మార్కెట్ నుండి గుడ్లవల్లేరు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఇంజన్ నుండి ఒకసారిగా దట్టమైన పొగ రావడంతో డ్రైవర్ అప్రమత్తమై బస్సును ఆపివేసి ప్రయాణికులను దించి వేశారు. మంటాడ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం సమీపంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ఇబ్బంది లేకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఇంజన్లో వైరింగ్ షార్ట్ అయిన కారణంగా పొగలు వచ్చినట్లు డ్రైవర్ తెలిపాడు. కాగా ఈ బస్సులో అగ్నిప్రమాద నివారణకు సంబంధించిన పరికరాలు ఏమి లేకపోవడం గమనార్హం. గ్రామంలో ఈ సంఘటన జరగడంతో స్థానికులు హుటాహుటిన బకెట్లతో నీరు తెచ్చి పోయడంతో ప్రమాదం తప్పింది. బస్సులో ఎటువంటి రక్షణ పరికరాలు లేకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేసారు. ఆర్టీసీ అధికారులకు ఏదో విధంగా బస్సులు నడపాలనే ఆలోచన తప్ప ప్రయాణికుల రక్షణకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం, కాలం చెల్లిన బస్సులను నడపడం పట్ల ప్రజలు తమ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.



## సహాయ ఫౌండేషన్ పేదవాడి ఫౌండేషన్

మచిలీపట్నం మేజర్ న్యూస్ : పోలుకొండ భానుతేజ,లలితశ్రీ దంపతుల సహకారంతో అందజేత మచిలీపట్నానికి చెందిన కుంపటి జయశ్రీకి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు భర్త లేరు అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు, జయశ్రీ మార్ట్ లో పని చేస్తూ తనకు వచ్చిన కొద్ది జీతంతో కుటుంబ పోషణ చేస్తున్నారు.అయితే పెద్ద కుమార్తె సిరిలతను,బి ఎస్ సీ నర్సింగ్ కోర్సుకు ఫీజుకు డబ్బులు లేక చదువు ఆపి వేసారు.ఈ విషయాన్ని సహాయ ఫౌండేషన్ కు తెలుపగా వారికి శుక్రవారం 20,000/- ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు మొహమ్మద్ ఉస్మాన్ భాషా,అంకాల రామకృష్ణ,ఖాజా,సప్పరపు పుష్ప తదితరులు పాల్గొన్నారు

## క్రీడా పోటీలలో సత్తా చాటిన ఎస్వీఎల్ విద్యార్థులు




అవనిగడ్డ, మేజర్ న్యూస్ : స్పోర్ట్స్ లీగ్ – 2024 క్రీడల పోటీలలో అవనిగడ్డ ఎస్ వి ఎల్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈనెల 2న గురువారం విజయవాడ కానూరు లోని కెసిపి సిద్ధార్థ ఆదర్శ్ పబ్లిక్ స్కూల్ లో నిర్వహిం చారు. ఈ పోటీలలో ఎస్ వి ఎల్ క్రాంతి జూనియర్ కళాశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో కబడీలో విన్నర్స్ గా, వాలీబాల్ లో రన్నర్స్ గా విజయం సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎస్వీఎల్ విద్యాసంస్థల్లో కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎన్వి నాగేశ్వరరావు, కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పి.డి తిరుపతమ్మ ను విజేతలైన విద్యార్థులను అభినందించారు.

## ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్‌కు 2025 పురస్కారం



అవనిగడ్డ, మేజర్ న్యూస్ : నవ్యాంధ్ర తొలి ఉప సభాపతి, అవనిగడ్డ శాసనసభ్యులు డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ "స్వామి వివేకానంద జీవన సాఫల్య పురస్కారం–2025" అందుకోనున్నారు. ఈ నెల 23 న అనపర్తి లో శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగే స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్, అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రామకృష్ణ మిషన్ సభ్యులు ఎం.దుర్గాప్రసాద్ చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకుంటారు.



## దేవరపల్లిలో తెలుగుదేశం సభ్యత్వ నమోదు

పామర్రు జనవరి 3 మేజర్ న్యూస్ : పామర్రు నియోజకవర్గం పరిధిలోని తోట్లవల్లూరు మండలంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్ర మం ముమ్మరంగా సాగుతోంది. శుక్రవారం మండల పరిధిలోని దేవరపల్లి గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దేవరపల్లి నాగరాజు, దిరిశం శివ, నాగేశ్వరరావు, దేవరపల్లి కోటేశ్వరరావు, కుంపటి నాగరాజు, నరేష్, శివయ్య, కోటేశు తదితరులు పాల్గొని ఇంటింటికి తిరిగి తెలుగుదేశం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

## 'బిగ్ టీవీ డేస్' ప్రకటించిన సామ్‌సంగ్ ఇండియా




విజయవాడ మేజర్ న్యూస్ : భారతదేశపు అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రా నిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, నూతన సంవత్సరం, గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని తమ 'బిగ్ టీవీ డేస్' ఆఫర్ ను తీసుకువచ్చింది. నియో క్యూఎల్ఈడీ 8కె, ఓఎల్ఈడీ, 4కె యుహెచ్డీ టీవీ మోడల్‌లతో సహా దాని ప్రీమియం బిగ్–స్క్రీన్ టీవీలపై ఆకర్షణీయమైన డీల్‌లను అందిస్తోంది. ఈ ఆఫర్ జనవరి 3 నుండి జనవరి 31 వరకు అందుబాటులో ఉంటుంది. వినియోగదారులు రూ. 2,04,990 విలువైన ఉచిత సామ్‌సంగ్ టివిలు, ఎంపిక చేసిన కొనుగోళ్లతో గరిష్టంగా రూ. 99,990 విలువైన సౌండ్‌బార్ లతో సహ అద్భుతమైన ఆఫర్‌ల నుండి ప్రయోజనం పొందవచ్చు. కస్టమర్ లు గరిష్టంగా 20 శాతం క్యాష్‌బ్యాక్, జీరో డౌన్ పేమెంట్, గరిష్టంగా 30 నెలల కాలవ్యవధితో ఈఎంఐ అవకాశాలను కూడా పొందవచ్చు.

## జి.కొండూరు మండల బిజెపి అధ్యక్షులుగా చల్లా మల్లేశ్వర ఏకగ్రీవ ఎన్నిక



జి.కొండూరు మేజర్ న్యూస్ : భారతీయ జనతా పార్టీ ప్రతిష్టా త్మకంగా నిర్వహించిన పార్టీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు, మైలవరం నియోజకవర్గం కన్వీనర్ నూతులపాటి బాలకోటేశ్వరరావు అధ్యక్షతన ఎ న్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గంలోని జి.కొండూరు మండల అధ్య క్షులుగా చల్లా మల్లేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమం లో మండల బీజేపీ నాయకులు ఉప్పల సత్యం, ఆయంచు సుబ్రహ్మ ణ్యచారి, టి.నాగిరెడ్డి, గొల్లపూడి తరుణ్ పాల్గొన్నారు.

## రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి




నందిగామ, డిసెంబర్ 3, మేజర్ న్యూస్ : చందర్లపాడు మండలం వెలది కొత్తపాలెం గ్రామ సచివాలయం లో శుక్రవారం నిర్వహించిన రెవిన్యూ సదస్సు కు హాజరైన నందిగామ రెవిన్యూ డివిజనల్ అధికారి కే బాలకృష్ణ గ్రామ ప్రజలు, రైతులు, వారి సమస్యలను రెవిన్యూ సదస్సు లో నందిగామ ఆర్డీవోకు అర్జీల ద్వారా అందించారు. అనంతరం ఆర్డిఓ మాట్లాడుతూ సదస్సులో వచ్చిన అర్జీలను వెలది కొత్తపాలెం గ్రామ ప్రజలు తెలిపిన పలు సమస్యలు సకాలంలో పరిష్కరించి, పరిష్కారాన్ని ఎండోర్స్మెంట్ ద్వారా అర్జీదారులకు తెలియజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చందర్లపాడు తహశీల్దార్ పాల్,అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



## డెఫ్ అండ్ డెంబ్ పిల్లలతో సీపీ న్యూ ఇయర్ వేడుకలు

**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** శుక్రవారం కమిషనర్ వారి కార్యాలయంలో నూతన సంవత్సరం – 2025 సందర్భంగా నగరంలోని అన్నమ్మ స్కూల్ ఫర్ హియరింగ్ అండ్ ఫిజికల్లి హ్యాండి క్యాప్డ్, బేబీ కేర్ సెంటర్ పిల్లలతో కలిసి నగర పోలీస్ కమిషనర్ కేక్ కట్ చేసి వారితో కాసేపు సరదాగా మాట్లాడారు. అనంతరం వారికీ శుభాకాంక్షలు తెలిపారు.

## పూలేకు నివాళులర్పించిన బీజేపీ శ్రేణులు



**నందిగామ, జనవరి 3, మేజర్ న్యూస్:** భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా బిజెపి శ్రేణులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పట్టణ అధ్యక్షులు మునగంటి కామేశ్వరావు.మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే ఆనాడు స్త్రీల సమస్యల హక్కుల పై ఆలోచించి విద్య, అన్ని రంగాలలో స్త్రీలకు సమానమైన హక్కుల కొరకు ఆనాడు పునాది వేయడం వల్లనే ఈరోజు స్త్రీలకి అన్ని రంగాలలో అవకాశం కలిగిందని దేశంలోనే మొట్టమొదటి విద్యా నేర్పిన గురువుగా మాతృమూర్తిగా వెలుగొందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ తొర్లి కొండ సీతారామయ్య. కో కన్వీనర్ చిరుమామిళ్ల శ్రీనివాసరావు. మండల అధ్యక్షులు గంటా వెంకట్రావు గుత్త బాలకృష్ణ. ముఖపాటి నరసింహారావు. గోనేల సత్యనారాయణ. రమాదేవి. రోజా. రమేష్. ప్రసాదు. అక్కి స్వామి. విజయ్. శివ. తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ క్షేత్రంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** సావిత్రి భాయ్ పూలే గొప్ప సామాజిక సంస్కర్త అని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక గాంధీ క్షేత్రంలో సావిత్రి భాయ్ పూలే జయంతి ఘనంగా జరిగాయి. కూటమి నేతలు ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొల్లూరి మాట్లాడుతూ బాలికలు, స్త్రీలు, యువతులు చదువుకోరాదనే నిర్బంధం కొనసాగుతున్న రోజుల్లో తన భర్త వద్ద విద్య నేర్చుకుని, నాటి సమాజాన్ని ఎదిరించి ఎంతోమంది నిరుపేద స్త్రీలకు విద్య నేర్పిన చదువుల తల్లి సావిత్రి భాయ్ పూలే అని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొప్పన భాను, కూటమి నాయకులు బండే రాఘవ, ఘంటసాల రాజమోహనరావు (కన్నయ్య), కొల్లూరి వాసు, మండలి రామ్మోహనరావు, గువ్వాబత్తిన నాగేశ్వరరావు, దివిసీమ లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్, గరికపాటి హరిబాబు, యలవర్తి చిన్నా, కొట్టె విజయ్, కొల్లూరి ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

## సక్రమ ఎదుగుదలకు పౌష్టికాహారం అవసరం



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** సక్రమ ఎదుగుదలకు పౌష్టిక ఆహారం తోడ్పడు తుంది అని సర్పంచ్ పైడిపాముల కృష్ణ కుమారి అన్నారు. శుక్రవారం చల్లపల్లి నారాయణ రావు నగర్ కాలనీలోని అంగన్వాడీ కేంద్రాన్ని సర్పంచ్ సందర్శించారు. అంగన్వాడీ ఆవరణలో కేంద్రం కార్యకర్త ముంతాజ్ పెంచిన కూరగాయలు, ఆకుకూరల మొక్కలు పరిశీలించి అభినందించారు. చిన్నారులతో ఆటలు ఆడించి, పాటలు పాడించి వారి అభ్యాసనా సామర్థ్యం పరిశీలించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఆదిలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.


# మినుము పంటలో సమయానుకూల సస్యరక్షణ కీలకం



### కృషి విజ్ఞాన కేంద్రం, సమన్వయ కర్త డాక్టర్ సుధా రాణి

**చల్లపల్లి మేజర్ న్యూస్ :** మినుము పంటలో సమయానుకుల సస్య రక్షణ కీలకమని ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల శాస్త్రవేత్తలు డా. సుధా రాణి, డా. రేవతి లు పేర్కొన్నారు. మండల పరిధిలోని పుచ్చగడ్డ, రామనగరం గ్రామాలలో మినుము పంటను పరిశీలించారు. ప్రస్తుత కాలంలో మినుము పంటలో పొగాకు లద్దె పురుగు ఉధృతి అధికంగా గమినిస్తున్నామని, దీని నివారణకు వేప సంబంధిత మందులను (1500 పి పి ఎం ) ఎకరానికి ఒక లీటరు చొప్పున పిచికారీ చేసుకోవాలని సూచించారు. తద్వారా తల్లి పురుగు గుడ్లు పెట్టకుండా, పెట్టిన గుడ్లు పొదగకుండా పిల్ల పురుగుల ఉధృతి తగ్గించుకోవచ్చు అని తెలియచేసారు. పురుగు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు స్పైనోసాడ్ 60 మి. లీ లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 60 మి. లీ లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రా. ఎకరానికి పిచికారీ చేసుకోవాలని వివరించారు.

మినుము పంటను కాండం గజ్జి తెగులు ఆశించి నష్టపరుస్తుందని, మొక్కలు వడలి చనిపోతున్నాయని తెలిపారు. దీని నివారణకు రిడోమిల్ గోల్డ్ 300 గ్రా. లేదా టెబ్యుకొనజోల్ 300 మీ.లీ ఎకరానికి చొప్పున నేల తడిచేలా పిచికారీ చేసుకోవాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకురాలు సుబ్రహ్మణ్యేశ్వరి, రైతులు పాల్గొన్నారు.




## హైందవ శంఖారావం సభ సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు

**గన్నవరం, జనవరి 3, మేజర్ న్యూస్ :** పోలీసు వారి ఆదేశాల ప్రకారం ఈ నెల 5న (ఆదివారం) కేసరపల్లి లో జరగనున్న హైందవ శంఖారావం సభ వలన ఉదయం 05.00 గంటల నుండి రాత్రి 10.00 గంటల వరకు గన్నవరం నుండి రామవరప్పాడు వరకు ట్రాఫిక్ పూర్తిగా ఆపివేయబడును. హనుమాన్ జంక్షన్ వైపు నుండి వచ్చు అన్ని బస్ లు చిన ఆవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ హాస్పిటల్ ఎదురుగా కొత్త బైపాస్ రోడ్డు లో వెళ్లి సున్న గ్రామం వద్ద క్రిందికి దిగి పాయకాపురం, అజిత్ సింగ్ నగర్ మీదుగా విజయవాడ బస్టాండ్ కు వెళ్ళ వలెను. మరల డౌన్ లో కూడా అదే రూట్ లో రావలెను.

**హనుమాన్ జంక్షన్ కాళేశ్వర మార్కెట్ సిటీ బస్సులు**

గన్నవరం గాంధీ బొమ్మ సెంటర్ నుండి బి బి గూడెం వద్ద క్రొత్త బైపాస్ రోడ్డు ఎక్కి ముస్తాబాద్ వద్ద క్రిందకు దిగి ముస్తాబాద్ గ్రామం, ఇన్నర్ రింగ్ రోడ్ నుండి రామవరప్పాడు రింగ్, గుణదల మీదుగా కాళేశ్వర మార్కెట్ కు వెళ్ళ వలసినదిగా తెలియజేస్తున్నారు.

## పామర్రు బీజేపీ అధ్యక్షునిగా ముదునూరు శివకృష్ణ



**పామర్రు జనవరి 3 మేజర్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ పామర్రు మండల అధ్యక్షునిగా ముదునూరు శివకృష్ణ ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి పంతం గజేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా పామర్రు మండల మాజీ ప్రెసిడెంట్ యార్లగడ్డ రమేష్ బాబు మాట్లాడుతూ పార్టీ అంతర్గత ఎన్నికల లో భాగంగా పామర్రు మండల అధ్యక్షునిగా ఎన్నికైన పెదమద్దాలి గ్రామానికి చెందిన ముదునూరు శివకృష్ణ క్రమశిక్షణ కలిగిన నాయకుడు అన్నారు. అలాగే రానున్న రోజుల్లో బిజెపి పార్టీ కూటమి నాయకులను అందర్నీ కలుపుకొని పార్టీ బలోపేతం చేసి పామర్రు మండలాన్ని బిజెపికి కంచుకోటగా మార్చాలని సూచించారు. ఎంపీ, రాష్ట్ర అధ్యక్షురాలు అయిన దగ్గుపాటి పురందేశ్వరికి మంచి పేరు తెచ్చే విధంగా నూతన అధ్యక్షుడు ఉండాలని బీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు పోలన అశోక్ సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల మాజీ అధ్యక్షులు యార్లగడ్డ రమేష్ బాబు, పోసిన శివరాంప్రసాద్, ముదునూరు కమల కుమారి, దున్న రాకేష్ బాబు, పి.పూర్ణచంద్రరావు, దాసరి సురేష్, హనుమ, ఉరిమి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జుజ్జువరం శివాలయంలో అయ్యప్పల ఇరుముళ్ళు





**పామర్రు జనవరి 3 మేజర్ న్యూస్ :** హరిహర పుత్రుడు శ్రీ అయ్యప్ప స్వామి దీక్ష స్వీకరించి 41 దినములు కఠిన నియమలతో పూర్తి చేసుకుని పసుపులేటి నాగ గురుస్వామి ఆధ్వర్యంలో 30 మంది అయ్యప్ప భక్తులు జుజ్జువరం శివాలయంలో శుక్రవారం ఇరుముడులు కట్టించుకన్నారు. అనంతరం శబరి గిరి యాత్రకు పయనమయ్యారు. అయ్యప్ప భక్తులు శబరి యాత్ర కు బయలుదేరగా బంధువులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఊరేగింపుగా వారి సాగనంపారు. దీక్ష ధరించిన వారి కుటుంబీకులు ఆలయ ప్రాంగణానికి చేరుకోవడంతో ఆలయ ప్రాంగణం హరినామస్మరణలతో మారుమోగింది. వారి యాత్ర సంపూర్ణ విజయవంతం కావాలని ఊరేగింపు నిర్వహించారు. గురుస్వాములు వరాల శ్రీనివాసరావు, మొగల అనిల్ కుమార్, కొనకళ్ళ నాగరాజు ల ఆధ్వర్యంలో ఇరుముడులు కట్టించుకుని అయ్యప్పలు శబరి యాత్రకు బయలుదేరి వెళ్లారు.

## భూ సమస్యల సత్వర పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదం



**పామర్రు జనవరి 3 మేజర్ న్యూస్ :** రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నామని తహసిల్దార్ కె.నవీన్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పమిడిముక్కల మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సంబంధించిన భూ సమస్యలు సత్వరం పరిష్కరించేందుకు ఈ సదస్సులు దోహదపడతాయన్నారు. రైతులు తమ సమస్యలను అర్జీల రూపంలో అందించడం ద్వారా 45 రోజుల్లోపు ఉచితంగా వాటిని పరిష్కారం చేసుకోవచ్చునన్నారు. ఈ సదస్సులో గ్రామ సర్పంచ్ వీరంకి బలుసులమ్మ, ఉప సర్పంచ్ యార్లగడ్డ శివ, మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు గంజాల సీతారామయ్య, రీసర్వే డిప్యూటీ తహసిల్దార్ కె.ఏసు పాదం, మండల సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్లు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలకు సంబంధించి రైతులు తొమ్మిది దరఖాస్తులను అందించారు.

# సావిత్రి భాయ్ పూలే జన్మదినాన్ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలి

## బీసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సావిత్రిభాయ్ పూలే జయంతి



**విజయవాడ మేజర్ న్యూస్ :** చదువు మాత్రమే ఈ సమాజ ఉద్ధరణకు గీటురాయని, ప్రతి ఒక్కరూ లింగ భేదం లేకుండా చదువుకొని ఉన్నత స్థితికి వెళ్ళాలని, కొద్ది మందికి పరిమితమైన చదువు, అందరికీ అందాలనే సంకల్పం 150 సంవత్సరాల క్రితమే ఆవిర్భవించిందని, దానికి కారకురాలు సావిత్రి భాయ్ అని రిటైర్డ్ తహసీల్దార్, భట్రాజుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోటంరాజు పేర్కొన్నారు. విజయవాడ నగర బి.సి ఐక్య వేదిక అధ్యక్షుడు పి.వి.ఎల్.ఎన్ రాజు అధ్యక్షతన శుక్రవారం నాడు క్రాంతి కారిణి, తొలి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రి బాయ్ పూలే 194వ జయంతి కార్యక్రమం విజయవాడ నగరం, పూర్ణానందంపేటలోని ఛాంద్ కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో తొలి తెలుగు దివ్వె, తెలుగు మూలాల అధ్యయన సంఘం, భారత్ అధ్యక్షురాలు, మధురానగర్ మాజీ కార్పొరేటర్ పిల్లి లక్ష్మీతులసి మాట్లాడుతూ ఈ రోజున మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారంటే దానికి వెనుక సావిత్రిభాయ్ పూలే వంటి వారి కృషి ఎంతో వుందని, వారి ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం వుందని పేర్కొన్నారు. సావిత్రి భాయ్ ఈ సమాజానికి చేసిన సేవలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సావిత్రి భాయ్ జయంతిని రాష్ట్ర మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించిందని, ఇదే విధముగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కూడా అధికారికంగా సావిత్రిభాయ్ జయంతిని రాష్ట్ర మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. రిటైర్డ్ సబ్ రిజిస్ట్రారు, సబ్ రిజిస్ట్రార్ల సంఘానికి రాష్ట్ర మాజీ అధ్యక్షులు భాస్కరరావు, బి.సి ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు ఛాంద్, ప్రముఖ న్యాయవాది, బి.సి నాయకులు కొల్లూరి, దాలిపర్తి ధన్వంతరి, సీనియర్ బి.సి నాయకులు తదితరులు పాల్గొని ఉపన్యసించారు. జ్యోతిభా పూలే ఆశయాలను కొనసాగించడానికి నగరంలో బి.సి ఐక్య వేదికను భలోపేతం చేస్తామని, త్వరలోనే అన్ని కులాలతో కూడిన నగర కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు బి.సి ఐక్య వేదిక అధ్యక్షుడు పి.వి.ఎల్.ఎన్ రాజు ప్రకటించారు.



### చదువుల తల్లి పూలేకు ఘన నివాళులు

**చల్లపల్లి మేజర్ న్యూస్ :** చదువుల తల్లి సావిత్రిభాయి పూలేకు చల్లపల్లిలో ఘన నివాళులు అర్పించారు. సామాజిక తత్వవేత్త మహాత్మా జ్యోతిరావు పూలే సతీమణి, దేశంలో తొలి ఉపాధ్యాయిని సావిత్రిభాయి పూలే 193వ జయంతి స్థానిక సీఆర్ ట్రస్ట్ లో జరిగింది. ఈ సందర్భంగా సావిత్రిభాయి పూలే చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఆర్ఓ సీసీ తూము వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ సంఘ నేత కామరాజుగడ్డ మోహన్, విశ్రాంత ఈఓఆర్డీ దాసి సీతారామరాజు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, నవ్యాంధ్ర ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కైతేపల్లి దాస్, విశ్రాంత ఫోర్ మెన్ ఉప్పాల సాంబశివరావు, బీసీ సంఘ నేతలు కేశనకుర్తి శరత్ బాబు, నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, దళిత సంఘ నేతలు బత్తుల ప్రసాద్, చిర్ల కిషోర్, ఏఐవైఎఫ్ నేత సిద్ధాబత్తుల వాసు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలు

**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో తొలి మహిళ ఉపాధ్యాయుని సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు శుక్రవారం ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు విశ్వ భారతి మాట్లాడుతూ బాలికల విద్యాభివృద్ధి కోసం సావిత్రిబాయి ఎనలేని కృషి, త్యాగాలు చేశారని ఆమె స్ఫూర్తితో బాలికలు ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయురాలు ప్రిన్సిపాల్ ఎస్.కె మీరున్నిసా, జెస్సి రాణి, హిమబిందు, నాగేశ్వరి లను ఎస్టియు ఆధ్వర్యంలో ఘనంగా శాలువలు పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు రాష్ట్ర కార్యదర్శి ఎం బసవయ్య, మండల అధ్యక్షుడు ఎన్ జార్జి వాషింగ్టన్, ప్రధాన కార్యదర్శి బి రామ్ నాయక్, కార్యదర్శి బిజ్జాన ప్రసూన, ఉపాధ్యక్షులు పి రవి, ప్రసాద్, కే ఉమాదేవి, పద్మజా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సమిష్టి కృషితో చేయూతనిద్దాం




**జి.కొండూరు మేజర్ న్యూస్ :** కిశోరి వికాసం-2 కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని, ఉజ్వల, ఆరోగ్యకరమైన, సాధికారిత దిశగా ఆమె వేసే అడుగుకు సమిష్టి కృషితో చేయూతనిద్దామని ఐసీడీఎస్ సిడిపివో కె.పుష్పలత అన్నారు.జి.కొండూరు కమ్యూనిటీ హాల్లో కిశోరి వికాసం-2 కార్యక్రమాన్ని క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కిశోరి వికాసం పోస్టర్లను ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో పుష్పలత మాట్లాడుతూ, కిశోరి వికాసం ప్రతి బాలిక భవిష్యత్తును మెరుగుపరచడానికి ఓ మంచి అవకాశమని పేర్కొన్నారు. ప్రతి బాలిక తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకోగలిగేలా సమగ్రాభివృద్ధి సొంతం చేసుకొనేలా ఈ కార్యక్రమం ద్వారా చేయూతనివ్వనున్నట్టు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీవోల సమన్వయంతో కార్యక్రమం పునఃప్రారంభమైందని, 11-18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబనను మెరుగుపరచడం ఈ కార్యక్రమ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందుకు ప్రతి గ్రామంలో బాలికల సంఘాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించడంతో పాటు, సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టు తెలిపారు. బాలికల్లో ఆత్మరక్షణ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం, డిజిటల్ భద్రత, సైబర్‌క్రైమ్, ఆన్‌లైన్ వేదికలపై జాగ్ర త్తగా వుండేలా అవగాహన కల్పించనున్నట్టు తెలి పారు. ఎంపీడీవో బీవీ రామ కృష్ణనాయక్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ, తహశీల్దార్ చాట్ల వెంకటేశ్వరరావు, ఎం.ఈ.ఓ, వెలుగు ఏపీఎం, సూపర్వైజర్లు ఇందుపల్లి అన్నమ్మ, జోజి కటాక్షం, ఎం.ఎస్.కెలు ఇంద్రజ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టిన ఎస్సై అర్జున్

**పెనుగంచిప్రోలు మేజర్ న్యూస్ :** పెనుగంచిప్రోలు మండలోని నవాబుపేట, కొనకంచి, తోటచర్ల క్రాస్ రోడ్ల వద్ద ప్రమాదాలు జరుగుతుండడంతో విజయవాడ కమిషనర్ ఎస్. వి. రాజశేఖర్ బాబు, నందిగామ ఏసీపి ఎబిజి తిలక్ ఆదేశాలతో జగయ్యపేట సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పెనుగంచిప్రోలు ఎస్సై.కే అర్జున్ ప్రమాదాల జరగకుండా నివారణ చర్య చేపట్టారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తోటచర్ల, నవాబుపేట , కొనకంచి క్రాస్ రోడ్డు కావడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండటంతో మూడు చోట్ల కూడా డ్రమ్స్ పెట్టి రేడియం స్టిక్కర్లను అమర్చడం జరిగిందని, గో, స్లో, స్టాప్ ,అని పేర్లు రాసి పోలీస్ వారి హెచ్చరిక పెట్టటం జరిగింది అని ప్రమాదాలకు ఎక్కువగా గురికాకుండా సుమారు ఈ మూడు క్రాస్ రోడ్లలో 40 నుంచి 50 వరకు భారీ గేట్లను ఏర్పాటు చేయడం జరిగిందఅని ప్రజలందరూ కూడా రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, రానున్న రోజుల్లో సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చే వారికి ఎటువంటి అంతరాయం కలగకుండా ఇటువంటి




ప్రమాదాలు జరగకుండా ఉండడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రజలందరూ ఏర్పాటుచేసిన వాటిని గమనించి తమ ప్రయాణం సుఖమంతంగా మరియు ప్రమాద అంచుల భారీ పడకుండా ఉంటారని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



### ఏ.కొండూరు మండలంలో...

**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** మండలంలోని కోదూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు డిజే యం.డి ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం భారత తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు వివి కృష్ణకుమారి, టి ఆరోగ్యం, ఎం రోహిణి, లావణ్య, వి శ్రీదేవి లను పూలమాలలు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 ఈసీఎల్ కేశవరావు, విద్యా కమిటీ చైర్మన్ కే నాగేశ్వరరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### బొడ్డపాడు యూపీ స్కూల్లో ఉపాధ్యాయినులకు సత్కారం



**పామర్రు జనవరి 3 మేజర్ న్యూస్ :** తోటవలూరు మండలం బొడ్డపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించి మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో నిర్వహించగా ముఖ్యఅతిథిగా రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యదర్శి, గ్రామ సర్పంచ్ మూడే శివశంకర్ రావు పాల్గొన్నారు. ఎన్టీఆర్ - ఘంటసాల కళాపీఠం అధ్యక్షులు కాటూరి వెంకట మురళీకృష్ణ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి బాపట్ల నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు నాగబాబు, నాగిరెడ్డి యోబు తదితరులు పాల్గొని మహిళా ఉపాధ్యాయులు సుమలత, సత్యలక్ష్మి, రమాదేవి, జ్యోతి, దేవి తదితరులను సత్కరించారు.

### సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** భారతదేశం తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 194వ జయంతి వేడుకలు ఎన్టీఆర్ జిల్లా జి కొండూరు మండలం చెవుటూరు గ్రామంలోని ఎంపియుపి, జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం సాయంత్రం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ వారి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అయినటువంటి కేవిన్జీ లక్ష్మి,పీ. మేరీ స్వర్ణలత లు సావిత్రిబాయి పూలే కు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో బాలిక విద్యను ప్రోత్సహించడం కోసం, బాల్యవివాహాలు నిర్మూలించడం కోసం అలాగే మహిళా అభ్యున్నతి కోసం సావిత్రిబాయి పూలే చేసిన సేవలు అన్నారు.ఆమెకు భారత ప్రభుత్వం భారతరత్న అవార్డు ఇవ్వాలనివారు కోరారు. ఈ కార్యక్రమంలో డి.బి. ఆర్సి సిటీ కోఆర్డినేటర్ అనిత బట్ట పర్తి,ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ మెంబర్ బట్టపర్తి రాజు ఉపాధ్యాయులు సిహెచ్ స్ వెంకటేశ్వరి, బి.మేరీ కే రాజమణి, స్వాతి వాణి, పీ.రాజ్ కుమార్, పి మాధవరావు,పి రఘు విద్యార్థులు పాల్గొన్నారు.





## సర్వీస్ ప్రొవైడర్లకు నైపుణ్య శిక్షణ కోరకు ఆహ్వానం

**దరఖాస్తు చేసుకునేందుకు నేడే చివరి తేది**



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో గల రకరకాల సర్వీస్ ప్రొవైడర్లను గుర్తించి వారికి నైపుణ్య సాంకేతిక శిక్షణ గవర్నర్పేటలోని ఐ వి పాలస్‌లో ఉదయమ్మ 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులు స్వీకరించారని విజయవాడ నగర పాలక సంస్థ ప్రాజెక్ట్ ఆఫీసర్ యు సి డి విభాగం అధికారి వెంకటనారాయణ తెలిపారు. ప్లంబర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రిషన్లు, ఏసీ, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ వంటి మరమ్మతులు చేసేవారు పెయింటర్, బ్యూటీషియన్( స్త్రీలైనా, పురుషులైనా) తదితర తగిన నైపుణ్య సాంకేతిక శిక్షణ సర్టిఫికెట్ ఇవ్వటంతో పాటు జీవనోపాధి కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా టిడిపి ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి మాట్లాడుతూ ప్రజల ఆర్థిక స్థితిని పెంచేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని ప్రజలు దీని సద్వినియోగం చేసుకొని వారికి ప్రభుత్వం కల్పించే నైపుణ్య శిక్షణను పొంది ఒకవైపు శిక్షణతో పాటు మరోవైపు జీవనోపాధి కల్పించే విధంగా ప్రభుత్వం చేస్తున్న ఈ కార్యక్రమంలో వాళ్ళు పాల్గొనేందుకు ఒక చక్కటి అవకాశం అని అన్నారు. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు 556 అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నరాని, ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు నేడే చివరి రోజు అని ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు గవర్నర్పేట ఐవీ ప్యాలెస్ ప్రాంగణంలో తమ పేరు వివరాలతో పాటు ఆధార్ కార్డు పాన్ కార్డు డ్రైవింగ్ లైసెన్స్ కాపీలతో పాటు విద్యార్హత అనుభవ ధృవీకరణ పత్రాలు పాస్బుక్ రేషన్ కార్డు వివరాలుతో నమోదు చేసుకోవాలని కోరారు. వీరందరికీ జనవరి 15 నుండి 31 వరకు ఉచితంగా ప్రభుత్వం వారిచే నైపుణ్య శిక్షణ ఇవ్వటమే కాకుండా ఉపాధి కల్పించ నున్నారు అని తెలిపారు. మరిన్ని వివరాలకు జివిస్ సుజాత 8790233881 పి మంజుల దేవి 7780683789 సంప్రదించాలని అధికారులు సూచించారు. శుక్రవారం దరఖాస్తులు స్వీకరించే కార్యక్రమంలో 23 వ డివిజన్ కార్పొరేటర్, టిడిపి ఫ్లోర్ లీడర్ నీలిబండ్ల బాలస్వామి, విజయవాడ నగరపాలక సంస్థ యుసిడిది భాగమధికారులు ఫణి కుమార్, సుజాత, జగదీశ్వరి పాల్గొన్నారు.

## బీజేపీ మండల అధ్యక్షునిగా శోభిల



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ అవనిగడ్డ మండల అధ్యక్షునిగా శోభిల ఏడుకొండలు ను నియమించారు. నియోజకవర్గ పరిశీలకులు రామినేని వెంకటకృష్ణ శుక్రవారం ఏడుకొండలుకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణ మాట్లాడుతూ మండలంలోని నాయకులు కార్యకర్తలు సోబిలి ఏడుకొండలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. మండలంలో గ్రామస్థాయిలో పార్టీని పటిష్ట పరచాలని అన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న పార్టీ ఎన్నికల్లో భాగంగా మండల అధ్యక్షుని ఎన్నిక చేయటం జరుగుతుందని వెల్లడించారు. ఈ సందర్భంగా ఏడుకొండలు ను పలువురు సత్కరించి మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో నందూరి రాజేంద్ర కుమార్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి తుంగల మురళీకృష్ణ, రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు చిరువోలు బుచ్చిరాజు, పార్టీ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి చాత్రగడ్డ రాజశేఖర్, నియోజకవర్గ కన్వీనర్ ఎండకుదురు రాజేంద్ర, పార్టీ సీనియర్ నాయకులు దేసు జగన్ మోహన్ రావు, మునగాల బాలకృష్ణ, చన్నగిరి సీతా రామాంజనేయులు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి ధ్యేయం

**అన్ని శాఖల్లో ప్రణాళికాయుత ప్రగతి సాధిస్తున్నాం**

**ఆరు నెలల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టాం**

**అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్**



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రుల సంపూర్ణ సహకారంతో ఈ ఆరు నెలల్లో నియోజకవర్గంలో వ్యవసాయం, ఇరిగేషన్, డ్రైనేజీ, ప్రధాన, అంతర్గత రహదారులు, రక్షిత మంచినీటి సరఫరా, వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి చేసిన కృషిని వివరించారు.

**ఇరిగేషన్, డ్రైనేజీ రంగాల అభివృద్ధి**

రైతులకు సమర్థవంతమైన ఇరిగేషన్, డ్రైనేజీ వ్యవస్థలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో నాబార్డ్, ఎంపీ లాడ్స్, ఏ.పీ.ఎస్.డీ.ఎం.ఏ, ఎస్.డీ.ఎం.ఎఫ్, ఎఫ్.డీ.ఆర్, ఓఅండ్ఎం నిధులతో కాలువలు, వరద కరకట్టలు, డ్రైనేజీల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రూ.4386.0179 కోట్లతో 139 పనులు ప్రతిపాదించినట్లు తెలిపారు. వీటిలో రూ.9.5119 కోట్లతో 52 పనులు ప్రారంభించినట్లు తెలిపారు. రూ.46 లక్షలతో రెండు పనులకు టెండర్లు ఖరారై పని ప్రారంభించాల్సి ఉందన్నారు. రూ.3.789 కోట్లతో పదకొండు పనులకు టెండర్లు పిలవాల్సి ఉందన్నారు. రూ.4372.253 కోట్లతో ప్రతిపాదించిన 74 పనులకు ప్రభుత్వం నుంచి పరిపాలన అనుమతి రావాల్సి ఉందన్నారు. వచ్చే వేసవిలో నాబార్డ్ నిధులతో ఔట్ ఫాల్ స్లూయిజుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తీర గ్రామాల్లో గత ఐదేళ్లలో సాగుకు దూరమైన ఐదు వేల ఎకరాలు సాగులోకి తేవటమే ధ్యేయం అన్నారు.

**రైతుల కళ్ళల్లో సంతోషం**

ధాన్యం కొనుగోళ్లలో వేగవంతంగా సొమ్ము చెల్లించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఇప్పటివరకు 4,465 మంది రైతుల నుంచి 35,933.16 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ. 81.85 కోట్లు చెల్లించినట్లు వివరించారు. నియోజకవర్గంలో సెప్టెంబరులో కురిసిన వర్షాలకు నష్టపోయిన 7,432 మంది రైతులకు రూ.9కోట్ల 55 లక్షలు ఇన్ పుట్ సబ్సిడీ అందించినట్లు వివరించారు. ఇటీవల వర్షాల సమయంలో రైతుల ధాన్యం కాపాడుకునేందుకు నియోజకవర్గంలో 431 టార్పాలిన్లు రొటేషన్ పద్ధతిపై రైతులకు సమకూర్చినట్లు తెలిపారు.

**సురక్షిత త్రాగునీరు అందించటమే ధ్యేయం**

నియోజకవర్గంలో వివిధ గ్రాంట్లు దాదాపు రూ.ఆరు కోట్లతో ఆర్.డబ్ల్యూ.ఎస్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందించటమే కూటమి ప్రభుత్వం ధ్యేయం అని ప్రతి ఇంటికి త్రాగునీరు ఇచ్చేందుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాల ఆధునీకరణకు సీఎస్ఆర్ నిధులు రూ.రెండు కోట్ల 78 లక్షల 50 వేలు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో మంగళాపురం, సాలెంపాలెం, విశ్వనాథపల్లి, చోడవరం, నాలి, పెద్దకమ్మవారిపాలెం, ఏటిమొగ, ఈలచెట్లదిబ్బ, రామచంద్రపురం, కమ్మనమోల, పాతమాజేరు, యండకుదురు, గుల్లలమోద గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాల ఆధునికరణ, మైక్రో ఫిల్టర్లు, సంపులు, ప్లాట్ ఫామ్స్ నిర్మాణ పనులు, మూలపాలెంలో ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. జిల్లా పరిషత్ నిధులు రూ.31 లక్షలతో వేకనూరు, జయపురం, మూలపాలెంల్లో సంపులు, మైక్రో ఫిల్టర్లు, ప్లాట్ ఫారంలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పరిషత్ నిధులు రూ.4 లక్షలతో మోపిదేవి మండలం కొక్కిలిగడ్డ ఎన్టీఆర్ కాలనీ, పెద్దకళ్ళేపల్లి మంగలివానిసింకు డ్రైనేజీపై రెండు పైప్ కల్వర్టులు నిర్మించనున్నట్లు తెలిపారు. ఎంపీ లాడ్స్ నిధులు రూ.83 లక్షలతో మోపిదేవి బాలుర హైస్కూల్ కం జూనియర్ కళాశాల, అవనిగడ్డ బాలుర జూనియర్ కళాశాలల్లో ఆర్ఓ ప్లాంట్స్ నిర్మాణం, వీ.కొత్తపాలెంలో మైక్రో ఫిల్టర్ల నిర్మాణం, ఎదురుమొండిలో ప్లాట్ ఫామ్, మైక్రో ఫిల్టర్ల నిర్మాణం, తలగడదీవిలో త్రాగునీటి చెరువుకు ఫెన్సింగ్ ఏర్పాటు, ఘంటసాల, లంకపల్లిల్లో రక్షిత మంచినీటి పథకాల ఆధునీకరణ చేపట్టినట్లు తెలిపారు. జల జీవన్ మిషన్ నిధులతో ప్రతి ఇంటికి కుళాయి కార్యక్రమం మళ్ళీ గాడిలో పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**అంగన్వాడీల్లో సౌకర్యాల కల్పన**

నియోజకవర్గంలోని ఏడు అంగన్వాడీ కేంద్రాల్లో రూ.2.52 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. 58 అంగన్వాడీ కేంద్రాలకు రూ.9.86 లక్షలతో త్రాగునీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. వీటిలో ఇప్పటికే 49 పనులు పూర్తయినట్లు తెలిపారు.

**ఉపాధి నిధులతో గ్రామీణ ప్రగతి**

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా రూ.27.15 కోట్లతో 43.95 కిలోమీటర్ల 447 సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి, ఇప్పటికే 30.15 కిలోమీటర్ల 294 రోడ్లు పూర్తి చేసినట్లు తెలిపారు. 173.86 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి రూ.2.06 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. 241 గోకులం షెడ్ల నిర్మాణానికి రూ.4.65 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఉపాధి పనుల ద్వారా 17,958 కుటుంబాలకు 3,49,393 పని దినాలు కల్పించి రూ.9.60 కోట్లు వేతనాల రూపంలో చెల్లించినట్లు తెలిపారు.

**హాస్టళ్ళ మరమ్మతులకు నిధులు**

నియోజకవర్గంలో తొమ్మిది సాంఘిక సంక్షేమ వసతి గృహాల మరమ్మత్తులకు రూ.126.98 లక్షలు, ఎనిమిది బీసీ వసతి గృహాల మరమ్మత్తులకు రూ.119.10 లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు.

**ఆర్ అండ్ బీ రోడ్ల అభివృద్ధి**

నియోజకవర్గంలో ఆర్.అండ్.బీ రోడ్ల మరమ్మత్తులు 26 పనులకు రూ.27.11 కోట్లు మంజూరు అయినట్లు తెలిపారు. పదకొండు ప్రధాన రహదారుల అభివృద్ధి పనులకు ఎంపీ లాడ్స్ రూ.76.50 లక్షలు, పది రోడ్ల అభివృద్ధి పనులకు జడ్పీ నిధులు రూ.50 లక్షలు, నాలుగు రోడ్ల అభివృద్ధికి పీ.ఎం.జీ.ఎస్.వై నిధులు రూ.1515.50 లక్షలు, తొమ్మిది రోడ్ల అభివృద్ధికి ఏఐఐబీ నిధులు రూ.2215.18 లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. మొత్తం రూ.4057.18 లక్షలతో 35 పనులు చేపట్టగా, రెండు పనులు పూర్తి అయినట్లు తెలిపారు. 32 పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ఒక పని ప్రారంభించాల్సి ఉందన్నారు. ఈ నిధుల్లో ఇప్పటివరకు రూ.414.80 లక్షలు ఖర్చు పెట్టినట్లు వివరించారు.

**పింఛన్ల రూపంలో రూ.1839.50 లక్షలు పంపిణీ**

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ద్వారా ఎన్నికల హామీని అధికారంలోకి వచ్చి న తక్షణమే అమలులోకి తీసుకొని వచ్చి నియోజకవర్గంలో 43,012 మంది లబ్ధిదారులకు ఇప్పటివరకు రూ.1839.50లక్షలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

**భారీగా సీఎంఆర్ఎఫ్ సహాయం**

ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఇప్పటికి 82 మంది లబ్ధిదారులకు రూ.61,13,767 సహాయం చేసినట్లు తెలిపారు.

**మళ్ళీ జల క్రీడల కళ**

నాగాయలంకలో జల క్రీడల కేంద్రం నిర్మాణం పూర్తి చేసేందుకు డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్స్ రూ.రెండు కోట్లు మంజూరు అయినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే నాగాయలంకలోని కృష్ణానది జల క్రీడల శిక్షణ కళను సంతరించుకుంటుందన్నారు.

## మామిడి తోటల సస్యరక్షణకు సూచనలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఉద్యాన పంటలకు జనవరి మాసంలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్య లను మండల ఉద్యాన అధికారి ఎన్ రమేష్ రైతులకు సూచించారు. శుక్రవారం పాత ఎడ్లంక తదితర ప్రాంతాల్లో మామిడి తోటలను ఆయన పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. మామిడిలో బోరాన్ లోపం ఉంటే పూత బాగా వచ్చిన పలదీకరణ సరిగా జరగకపోవడం వలన పింది కట్టు సరిగా ఉండదన్నారు. బోరాన్ లోపాన్ని సవరించి పిందికట్టు పెంచడానికి పోతా మొగ్గలు బయటకు రాకముందే బోర్ఎక్స్ పౌడర్ రెండు గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని, కొత్త చిగురు వచ్చేటప్పుడు, పువ్వులు పెరుగుదల దశలో ఉన్నప్పుడు 1/5-2.0, గ్రాములు జింక్ సల్ఫేట్, 1.5-2.5, గ్రాములు బోరాన్ లీటర్ నీటికి కలిపి చెట్లు బాగా తడిచే విధంగా పిచికారి చేయాలని అన్నారు. తేనె మనసు, తామర పురుగు నివారణకు మామిడి చెట్లు పూ మొగ్గ దశలో ఉన్నప్పుడు 0.3ఎంఎల్ ఈమెడ క్రోఫీడ్, లేదా 1.5 గ్రామ్ ఎస్పేట్, 1 మిల్లీ లీటర్ డైఫన్ కొనోజోల్ 2.5 గ్రాములు మ్యాంగోజప్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.పూత దశలో బూడిద తెగులు నివారణకు నీటిలో కరిగే గ్రంథం 3 గ్రాములు లేక రేడి మార్పు లేదా డైనోకాఫ్ 1 మిల్లీమీటర్ లేదా ఎక్ససా కానోజాల్ 2 మిల్లీ లీటర్లు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని అన్నారు. నిమ్మలు పూతా, పిందె రాలకుండా ప్లానాఫిక్స్ 1 మిల్లీలీటరు 4.5 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని, కలుపు నివారణలో భాగంగా పాదులలో ఉన్న కలుపును తీసివేయాలని నిమ్మచెట్టు మొదలగు బోర్డు పేస్ట్ పూయాలన్నారు ఈ కార్యక్రమంలో కనగాల సత్యంబాబు, గంగయ్య,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకునేలా చర్యలు తీసుకుంటాం..

## అంత్యక్రియల నిమిత్తం తక్షణ సాయం కింద రూ.50 వేలు అందించిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం నగరంలో జరుగుతున్న పోలీస్ సెలక్షన్ ఈవెంట్స్ లో పరుగు పందెంలో అస్వస్థకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మరణించిన ధారావత్ చంద్రశేఖర్ (25) కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకునేలా ప్రభుత్వం తరపున చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన మచిలీపట్నం సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అంత్యక్రియల నిమిత్తం తక్షణ సాయం కింద గిరిజన, పోలీస్ శాఖల తరపున రూ.25 వేలు చొప్పున మొత్తం రూ.50 వేలు మృతుడి కుటుంబ సభ్యులకు ఆయన అందించారు. మచిలీపట్నం నుంచి మృతుడి స్వగ్రామానికి భౌతికాయాన్ని తరలించేందుకు అంబులెన్స్ ను ఏర్పాటు చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏ.కొండూరు మండలం, జీలకొండ గ్రామానికి చెందిన దారావత్ చంద్రశేఖర్ మరణం తనకు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని, ఎంతో భవిష్యత్తు కలిగిన ఆ యువకుడు మరణించటం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఎస్టీ కమిషన్ బాధిత కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఆ కుటుంబానికి తగిన న్యాయం జరిగేలా ఎస్టి కమిషన్ సభ్యుడిగా తగిన కృషి చేస్తామని ఆయన కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. అంతకుముందు ఆయన స్థానిక బెల్ గెస్ట్ హౌస్ లో అదనపు ఎస్పి వివి నాయుడు, బందరు ఆర్డీవో కే స్వాతి, తహసిల్దార్ మధుసూదనరావు, గిరిజన సంక్షేమ అధికారి ఫణి ధూర్జటి తదితర అధికారులతో యువకుడి మరణానికి గల కారణాలు తదితర అంశాలపై చర్చించారు. బందరు డిఎస్పి అబ్దుల్ సుభాన్, గిరిజన ప్రజా సమైక్య జిల్లా అధ్యక్షుడు భుక్యా సమీర్ నాయక్, రాష్ట్ర యువజన అధ్యక్షులు ఇస్లావత్ హనుమంతు నాయక్, బి వాసు నాయక్, గిరిజన సంఘాల నాయకులు తదితరులు ఆయనతో పాటు ఉన్నారు.

# రోడ్డు ప్రమాద కేసులలో బాధితులకు కేంద్రం నుండి వచ్చే నష్ట పరిహారం అందేలా చేసిన సీపీ



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** ఎస్.వి రాజశేఖర్ బాబు ఎన్.టి.ఆర్ జిల్లా పోలీస్ కమీషనరేట్ పోలీస్ కమీషనర్ గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి రాష్ట్ర డి.జి.పి. ద్వారకా తిరుమల రావు నేతృత్వంలో సాంకేతిక పరిజ్ఞానంను ఆయుధంగా చేసుకుని ఎన్.టి.ఆర్ పోలీసు కమిషనరేట్ ను సాంకేతిక పరిజ్ఞానంలో దేశానికె తలమానికంగా నిలబెట్టాలనే ధ్యేయంతో స్మార్ట్ గా వ్యవహరిస్తూ టెక్నాలజీని ఉపయోగిస్తూ పలు అద్బుతమైన కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఈ క్రమంలో సమాజంలో వివిధ రకాల నేరాలు, ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి, నేరాలు జరిగిన తరువాత దర్యాప్తు చేసే కంటే, అవి జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా నేరాలకు అడ్డుకట్ట వేయాలనే ప్రధాన ఉద్దేశ్యంతో, ప్రజలు శాంతి భద్రతల పరంగా, ట్రాఫిక్ పరంగా పడుతున్న ఇబ్బందులను గుర్తించి స్మార్ట్ గా వ్యవహరిస్తూ సాంకేతిక పరిజ్ఞానంను ఉపయోగించి త్వరితగతిన ఇబ్బందులను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడంజరిగింది. ఈ నేపధ్యంలో గుర్తు తెలియని వాహనాలు దీకొని మరణించిన లేదా శాశ్విత అంగవైకల్యం పొందిన వారికి సుప్రీం కోర్ట్ తీర్పు మేరకు మరణించిన వారి కుటుంబాలకు 02 లక్షలు, శాశ్విత అంగవైకల్యం పొందిన వారికి రూ.50 వేలను కేంద్ర ప్రభుత్వం వారు నష్ట పరిహారంగా అందించడం జరుగుతుందని తెలుసుకుని ఎన్.టి.ఆర్.జిల్లా నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాద బాధితులను ఆర్ధికంగా ఆదుకుని న్యాయం చేయాలనే సహృదయంతో రోడ్డు ప్రమాద (హిట్ & రన్ కేసులలో) ( గుర్తు తెలియని వాహనాలు చేసిన రోడ్డు ప్రమాదాలలో) కేసుల చేధనకై, కేంద్ర ప్రభుత్వం నుండి నష్ట పరిహారం అందించడానికి కావాల్సిన అన్ని పత్రాలను సేకరించడానికి డి.సి.పి. కృష్ణ మూర్తి నాయుడు నేతృత్వంలో ఏ.సి.పి. పి. రామచంద్ర రావు, ఎస్. ఐ. మల్లేశ్వరి, పోలీస్ సిబ్బందితో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ది01.04.2022 నుండి ఇప్పటి వరకు ఎన్.టి.ఆర్.జిల్లా నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 221 జరిగిన రోడ్డు ప్రమాద (హిట్ & రన్) కేసులు నమోదైనవి. బాధితులకు కేంద్ర ప్రభుత్వం వారు అందించే నష్ట పరిహారం కోసం చేయవలసిన అప్లికేషన్ కు సుప్రీం కోర్ట్ సూచనల మేరకు 1-4 ఫారాలలో కావాల్సిన అన్ని వివరాలను జనరల్ ఇన్సూరెన్స్, డిప్యూటి కలెక్టరేట్ కార్యాలయం, కలెక్టరేట్ మొదలగు శాఖలను సమన్వయం చేసుకుంటూ కావాల్సిన పత్రాలను సమకూర్చుకుని పూర్తి వివరాలతో కూడిన ఫారాలను కలెక్టర్‌కి పంపడం జరుగుతుంది. కలెక్టర్ సంబంధిత క్లైమ్ అధికారులకు పంపి బాధితులకు నష్టపరిహారం అందేలాగా చేస్తారు. ఇప్పటి వరకు సదరు ప్రత్యేక బృందం వారు 120 కేసులకు సంబంధించిన ఫారాలను కలెక్టర్‌కి పంపడం జరిగింది. వాటిల్లో జనరల్ ఇన్సూరెన్స్ అధికారులకు 30 వెళ్ళగా వాటిల్లో 15 మంది బాధితులకు రూ.10 లక్షల 50 వేల నగదు వారి వారి ఎకౌంటు లలో జమ చేయడం జరిగింది. పోలీస్ కమీషనర్ వీటిపై ప్రత్యేక చొరవ చూపి ఇన్సూరెన్స్ అధికారితో మాట్లాడి త్వరితగతిన వచ్చే విధంగా మాట్లాడటం జరిగింది.

ఈ నేపధ్యంలో శుక్రవారం నగర పోలీస్ కమీషనర్ కార్యాలయంలో పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు సదరు బాధిత కుటుంబాలతో సమావేశం ఏర్పాటు చేసి వారితో రోడ్డు ప్రమాద వివరాలపై మాట్లాడటం జరిగింది. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం నుండి నష్ట పరిహారం రావడంలో కీలకంగా వ్యవహరించిన డి.సి.పి. కృష్ణ మూర్తి నాయుడుని, డిప్యూటి కలెక్టర్ జి. మహేశ్వర రావుని, స్టేట్ జనరల్ ఇన్సూరెన్స్ అధికారి డి.రామ్ సుధాకర్‌ని, ఏ.సి.పి. పి. రామచంద్ర రావుని, ఎస్.ఐ. మల్లీశ్వరిని, డిప్యూటి తాసిల్దార్ ఎస్. నాగజ్యోతి, పోలీస్ సిబ్బందిని, కలెక్టర్ కార్యాలయ సిబ్బందిని, అభినందించారు. ఈ క్రమంలో బాధిత కుటుంబాల వారు మాట్లాడుతూ.... రోడ్డు ప్రమాదాలలో నష్టపోయిన బాధిత కుటుంబాలకు ఈ విధంగా నష్టపరిహారం అందించి ఆదుకున్న పోలీస్ కమీషనర్‌కి, కలెక్టర్‌కి,, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబుతోపాటు, డి.సి.పి.లు గౌతమీ షాలి, తిరుమలేశ్వర రెడ్డి, కృష్ణ మూర్తి నాయుడు, డిప్యూటి కలెక్టర్ జి. మహేశ్వర రావు, స్టేట్ జనరల్ ఇన్సూరెన్స్ అధికారి డి.రామ్ సుధాకర్, ఏ.సి.పి. పి.రామచంద్ర రావు, ఎస్. ఐ. మల్లీశ్వరి,ఇతర అధికారులు, పోలీస్ సిబ్బంది, బాధిత కుటుంబాల వారు పాల్గొన్నారు.





## నేటి దిన పత్రిక సూర్య క్యాలెండర్ ఆవిష్కరించిన ఆర్టీవో




**నందిగామ, జనవరి 3, మేజర్ న్యూస్:** నేటి దిన పత్రిక సూర్య - 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరణ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో కే బాలకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ ఆర్డిఓ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ, నేటి దినపత్రిక సూర్య విలువలతో కూడిన వార్తలతో సమాజానికి దిశా నిర్దేశం చేస్తుందన్నారు. సమాజంలో పత్రికల పాత్ర కీలకమైందని, వీటికి స్వేచ్ఛ ముఖ్యమన్నారు. పత్రికల్లో పని చేసే జర్నలిస్టులకు పత్రికలకు కూడా స్వేచ్ఛ ఉండాలని అన్నారు. ఎవరికి భయపడకుండా నిర్భయంగా నిస్సంకోచంగా వార్తలు రాసి నిజా నిజాలను నిగ్గు తేర్చాల్సిన అవసరం పాత్రికేయులపై ఉందన్నారు. ప్రభుత్వం-ప్రజలకు మధ్య వారధి పత్రికలని, ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరువేయడంలో వాటి పాత్ర కీలకమని పేర్కొన్నారు. అనంతరం పార్టీ కార్యకర్తలందరికీ ఈ క్యాలెండరును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నేటి దినపత్రిక సూర్య జిల్లా మేనేజర్, స్టాఫ్ రిపోర్టర్ ఎం. ఏ. ఖాజా మొహిద్దిన్, తదితరులు పాత్రికేయులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ కాలనీలో..

# రేషన్ పుష్ప రాజ్

**సిండికేట్ నాకు అప్పచెప్పండి**

**నా వెనకాల బొమ్మసాని ఉన్నారు... అంతా పెద్దన్న చూసుకుంటాడు**

**రాత్రి టీడీపీ రేషన్‌ను అడ్డుకున్న వైసీపీ**

**రంగంలోకి దిగిన టీడీపీకి చెందిన పుష్ప రాజ్**

**వైసీపీ నేతతో ముందుగానే మంతనాలు ?**

**తీవ్ర హైడ్రామా మధ్య పుష్ప రాజ్ రాగానే రేషన్ వదిలేసిన వైసీపీ నేత**

**యధేచ్ఛగా కాలనీ నుంచి తరలించేసిన టీడీపీ సిండికేట్**

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** పుష్ప సినిమాను తలపిస్తుంది వైఎస్సార్ కాలనీలో రేషన్ మాఫియా సన్నివేశాలు.. పుష్ప సినిమాలో ఎర్ర చందనం ఎలా బోర్డర్ దాటిస్తారో సేమ్ వైఎస్సార్ కాలనీలో రేషన్ బోర్డర్ దాటించి హీరోయిజం చూపిస్తున్నారు. నిన్న రాత్రి టీడీపీ బియ్యాన్ని వైసీపీ పట్టుకోవడం ఆ తర్వాత తీవ్ర హైడ్రామా మధ్య కాలనీ నుంచి మూడు క్వింటాళ్ల రేషన్ దాటించేయడం పుష్ప సినిమాను తలపించింది. అధికారుల విషయం తెలిసిందేగా ముందు నుంచి **నేటి దినపత్రిక సూర్య** హెచ్చరిస్తున్నా కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.



రాత్రి సమయంలో వైఎస్సార్ కాలనీలో అరుపులు.. కేకలు.. ఒకటో నెంబర్ బ్లాకు వద్ద టీడీపీ - వైసీపీ మధ్య ఘర్షణ వాతావరణం. టీడీపీ ప్రభుత్వ బియ్యాన్ని తరలిస్తుందన్న సమాచారంతో రెక్కీ నిర్వహించి మరీ పట్టుకున్నారు వైసీపీకి చెందిన నేత. మా బియ్యాన్నే పట్టుకుంటావా అంటూ టీడీపీ, వైసీపీ మధ్య మాటల తూటాలు పేలాయి. ఇంకేముంది ఒకటో నెంబర్ బ్లాకు చుట్టుపక్కల మొత్తం ఇదే టాపిక్. మనం అమ్మేసిన బియ్యాన్ని పట్టేసుకున్నారన్న టెన్షన్ ప్రతిఒక్కరిలో నెలకొంది. తీరా సీన్ కట్ చేస్తే వైసీపీ నేత అప్పటిదాకా అజ్ఞాతంలో ఉన్న టీడీపీ నేత చెబితే వదిలేస్తా అన్న కండీషన్ పెట్టడంతో ఒక్క కాల్ తో ఆఘమేఘాల మీద రంగంలోకి దిగేశాడు ఆ పుష్ప రాజ్.. ఇంకేముంది నేను చెబుతున్న విను తమ్ముడు ఫస్ట్ రేషన్ వదిలే అనంగానే వైసీపీ నేత నువ్వు చెప్పావు కాబట్టి వదిలేస్తున్నా అని బియ్యాన్ని వదిలేశాడు. అంతా అయ్యాక ఆ పుష్పరాజ్ ఇది మన లెవల్.. కాలనీలో ఎలాగో రేషన్ నాకేఅమ్ముతున్నారు కాబట్టి మిగిలిన వాళ్ళు రేషన్ దాటించే బాధ్యత నాకే అప్పచెప్పండి అంటూ సిండికేట్‌ని తనవైపు తిప్పికొనే ప్రయత్నం చేశాడు. ఇదంతా రాత్రంతా కాలనీలో జరుగుతున్న అటు పోలీసులకు గాని ఇటు సివిల్ సప్లై అధికారులకు గాని తెలియకపోవడం కొసమెరుపు. ఇంతకీ మూడు క్వింటాళ్ల బియ్యం ఎవరు తరలించారు ఎక్కడికి తరలించారు. నిజంగానే ఈ రేషన్ మాఫియాలో టీడీపీ నేత చెబుతునట్లు బొమ్మసానికి సంబంధం ఉందా? లేదా? అనేది రేపటి సంచికలో చూద్దాం...

# కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ కాలేజ్ గ్రౌండ్స్‌లో యువకెరటాలు







## రెండు రోజులపాటు జరగనున్న యువకెరటాలను లాంఛనంగా ప్రారంభించిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సబితమ్మ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** తొలి రోజు కార్యక్రమానికి వేలాదిగా వచ్చిన విద్యార్థినీ విద్యార్థులుయువతలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసే దిశగా యువకెరటాలు తొలి రోజు పాఠశాల స్థాయిలో విద్యార్థినీ విద్యార్థులకు చిత్ర లేఖనం, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహణ పోటీల్లో వందల సంఖ్యలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు మచిలీపట్నం హిందూ కాలేజీ ఆవరణలో కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ కెరటాలు కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ చైర్మన్, కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, కొనకళ్ళ నారాయణ రావు,బీసీ సంక్షేమ మంత్రి సవితమ్మ, మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు ఫౌండేషన్ అధినేత కొల్లు నీలిమ కొల్లు పునీత్ మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమరి బాబా ప్రసాద్, జనసేన నాయకులు బండి రామకృష్ణ, మాదివాడ రాము, గడ్డం రాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు బత్తిన దాసు,గొర్రెపాటి గోపీచంద్ ఎలియాస్ బాషా యార్లగడ్డ సీతారామయ్య, గోపు సత్యనారాయణ లంకిశెట్టి నీరజ, కూటమి నాయకుల పాల్గొన్నారు.









# నిర్లక్ష్యానికి నిలువుటద్దం






## భద్రతా పరమాణాలు పాటించకుండా అధికలోడుతో ఇసుక టిప్పర్

**కంచికచర్ల జనవరి 3 మేజర్ న్యూస్ :** అధికలోడు,అక్రమ ఇసుక, భద్రతా ప్రమాణాలు పాటించకుండా రవాణా జరుగుతున్న అధికారులు ఏమి పట్ట నట్లు వ్యవహరించడం పట్ల పలు విమర్శలు వస్తున్నాయి. కనీసం పట్టా కూడా లేకుండా నిండుగా ఇసుకలోడుతో ప్రధాన రహదారుల్లో టిప్పర్లు హల్చల్ చేస్తున్నాయి.దీనివల్ల ప్రధాన రహదారిలో తిరిగే ద్విచక్ర వాహన దారులు పాదచారులు కళ్ళనిండా ఇసుకబడి పలు ఇబ్బందులకు గురవుతున్నారు. కళ్ళలో ఇసుకపడి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కంచికచర్ల మండలంలోని ఇసుక ర్యాంపుల నుండి నిత్యం పరిమితికి మించి ఇసుక రవాణా జరగటం బహిరంగ రహస్యమే.పేద మధ్యతరగతి ప్రజలకి ఇసుక అందుతుందో లేదో తెలియదు కానీ, గుత్తేదారులు మాత్రం టన్నుల కొద్ది ఇసుక తరలించడం పరిపాటిగా మారింది.అత్యధిక లోడుతో వెళ్తున్న వాహనాలపై ఏ ఒక్క అధికారి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించట్లేదు.చివరకు ఈ వాహనదారులు భద్రతా ప్రమాణాలు కూడా పాటించకుండా ప్రజలను ఇబ్బందికి గురి చేస్తున్నా ప్రభుత్వాధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# డిప్యూటీ సీఎం ఫోటో ఎక్కడా?

## ప్రభుత్వ విధి విధానాలకు భంగం కలిగిస్తున్న కంచికచర్ల మండల పరిషత్ అధికారిని?



**కంచికచర్ల జనవరి 3 మేజర్ న్యూస్ :** స్థానిక మండల పరిషత్ అధికారిని పనితీరు రాష్ట్ర సీఎం ఆదేశాలను కూడా లెక్కచేయని విధంగా ఉన్నట్లు విమర్శలు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు పైబడుతున్న ఇప్పటికీ ప్రోటోకాల్ పాటించకుండా కంచికచర్ల మండల పరిషత్ అధికారిని పనితీరును పలువురు కూటమి నేతలు తప్పు పడుతున్నారు. ప్రోటోకాల్ ప్రకారం సీఎం ఫోటో పక్కన డిప్యూటీ సీఎం ఫోటో ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో ఉండాలని ఏపీ ముఖ్యమంత్రి ప్రభుత్వం ఏర్పడిన ప్రారంభంలోనే ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను బేఖాతరు చేశారని వాదనలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై ఉన్నతాధికారుల స్పందన ఎలా ఉంటుందో అని కూటమి నాయకులు ఎదురుచూస్తున్నారు. నిధుల మీద ఉన్న ధ్యాస విధి విధానాల్లో లేకుండా పోయిందని కూటమి నేతలు విమర్శిస్తున్నారు. మండల కేంద్రంలో ప్రధాన కార్యాలయంలోనే డిప్యూటీ సీఎం ఫోటో పట్ల ఇలా అశ్రద్ధ వహిస్తే మిగిలిన కార్యాలయాల్లో పరిస్థితి ఏమిటోనని ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

# చల్లపల్లి బస్టాండులో ఆర్టీసీ కార్గో సేవలు ప్రారంభం

## ప్రారంభించిన డిపో మేనేజర్ హనుమంతరావు





**చల్లపల్లి మేజర్ న్యూస్ :** ఆర్టీసీ కార్గో సేవలు సద్వినియోగం చేసు కోవాలని అవనిగడ్డ డిపో మేనేజర్ కే.హనుమంతరావు కోరారు. శుక్రవారం చల్లపల్లి లోని ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ కార్గో, కొరియర్ సేవల కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిధిగా విచ్చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ తక్కువ చార్జీకే నాణ్యమైన, వేగవంతమైన సేవలు ఆర్టీసీ కార్గో, కొరి యర్ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ పి.శ్రీధర్, ఏడీసీ బి.వెంకటేశ్వరరావు, నిర్వాహకుడు షేక్.ఎజాజ్ అహ్మద్, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు మోర్ల శివ, బి సి నాయకులు పెనుమూడి శ్రీనివాసరావు, మెట్రో ఆప్టికల్స్ అధినేత ఆకురాతి హరిప్రసాద్, ఎంఏ కే జిలాని పాల్గొన్నారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999